క్లుప్తంగా

నేడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



గౌరీ పరమేశ్వరులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, చూచుకొండ గ్రామాల్లో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చూచుకొండలో పెంటకోట కుటుంబాలకు చెందిన వారు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. నాగులాపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి బీమా సాయం అందజేస్తున్న సర్పంచ్ చిలుకు

రాంబిల్లి: దిమిలిలో అనారోగ్యంతో మృతి చెందిన శిగిరెడ్డి అప్పలనాయుడు కుటుంబసభ్యులకు శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సర్పంచ్ బంగారు చిలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రాజుబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.రేవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.జ్యోతి పాల్గొన్నారు.


పోస్టల్ గ్రామీణ డాక్ సేవకల సమ్మె



పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

పాయకరావుపేట: తమ డిమాండ్లు నెరవేర్చాలని పోస్టల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న గ్రామీణ డాక్ సేవకలు ఈ నెల 14 నుంచి సమ్మె చేస్తున్నారు. ఈమేరకు స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద వారు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు సర్వీసును బట్టీ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్సు రూ.5 లక్షలకు పెంచాలని, గ్రాడ్యుటీ పెంచాలని, కమలేష్ చంద్ర కమిటీ కమిటీ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న బంగారు చిట్టి

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బంగారు చిట్టి శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.త్వరలో జరిగే టెన్త్ పరీక్షల్లో మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎరిపిలి ముసలి, ధోని, వెంకన్న, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


23న వాహనాల వేలం

పాయకరావుపేట : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ నెల 23న వాహనాలు వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ ఎస్‌ఐ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను ఆ రోజు ఉదయం వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం ఎస్‌ఈబీ కార్యాయలంలో సంప్రదించాలని, వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా ధరావత్తు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

పక్కా రోడ్లు.. ఎంచక్కా ప్రయాణం



చూచుకొండ రోడ్డు



ఇది కదా అభివృద్ధి

రూ.18కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధి

ప్రయాణికులకు తప్పిన అవస్థలు

మండలం : మునగపాక
సచివాలయాలు: 21
పంచాయతీలు: 26
రెవెన్యూ గ్రామాలు : 48
నిర్మించిన ప్రధాన రోడ్లు : 16
కిలోమీటర్లు : 36
వెచ్చించిన నిధులు: రూ.20.53 కోట్లకు పైగా

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. శిథిలావస్థకు గురైన రహదారుల స్థానంలో పక్కా రోడ్లు నిర్మించారు. పలు రహదారులు నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. గతంలో గ్రామాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేకపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడాల్సి వచ్చేది. పలు చోట్ల రహదారులకు మరమ్మతులు, మరికొన్ని చోట్ల అవసరం మేర కొత్త రహదారుల నిర్మాణం చేశారు.

వెచ్చించిన నిధులు ఇలా...

మండల వ్యాప్తంగా రోడ్లు అద్దంలా మారడంతో రాకపోకలు సాగించేవారి సమస్యలు పరిష్కారమయ్యాయి. మునగపాక మెయిన్‌రోడ్డు నుంచి వాడ్రాపల్లి, పాటిపల్లి, నాగవరం, మల్లవరం, మంగళవరపుపేట, మూలపేట, తోటాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గతంలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు గోతులమయంగా ఉండడంతో రాకపోకలు సాగించేవారు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.48లక్షల వీఎంఆర్‌డీఏ నిధులతో పక్కా రోడ్డు నిర్మించింది. ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. రూ.10.50 కోట్లతో 90 పనులు పూర్తి చేశారు.



తోటాడ నుంచి మూలపేటకు వెళ్లే రోడ్డు

- అచ్యుతాపురం మండలం కొండకర్ల జంక్షన్ నుంచి మునగపాక మండల పరిధిలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల మీదుగా కశింకోట మండలం నర్సింగబిల్లి వరకు 12 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.2 కోట్లు ఖర్చు చేశారు.
- అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట నుంచి మునగపాక మండలం కుమారపురం వరకు 6.8 కిలోమీటర్ల మేర రూ.1.50 కోట్లతో రహదారి నిర్మించారు.
- మునగపాక పీహెచ్‌సీకి వెళ్లే మార్గం నుంచి కశింకోట మండలం వెదురుపర్తి వరకు 8.5 కిలోమీటర్ల మేర రూ.3.74కోట్లతో రోడ్డు నిర్మించారు.
- మునగపాక నుంచి మంగళవరపుపేటకు వెళ్లేందుకు రూ.30లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టారు.
- మునగపాక నుంచి మూలపేట మీదుగా తోటాడకు వెళ్లేందుకు రూ.1.20కోట్లతో రోడ్డు నిర్మించారు.
- చూచుకొండ పీఏసీఎస్ కార్యాలయం నుంచి రామగిరి వరకు రూ.45లక్షల వ్యయంతో రోడ్డు నిర్మించారు.
- ఎంపీ ల్యాడ్స్ నిధులతో నాగవరంలో రూ.5లక్షలతో రోడ్డు,తిమ్మరాజుపేటలో రూ.5లక్షలతో మరో రోడ్డు, గణపర్తిలో 5 రహదారులు, పాటిపల్లిలో 2 రహదారుల నిర్మాణాలకు గాను రూ.35లక్షల మేర నిధులు ఖర్చు చేశారు.
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.35లక్షలతో పది పనులు పూర్తి చేశారు.
- రాజుపేట నుంచి కాకరాపల్లి మీదుగా పాటిపల్లికి వెళ్లేందుకు వీలుగా రూ.2.53కోట్లతో రహదారిని అభివృద్ధి జరిపారు.
- అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.7.9కోట్లు కేటాయించారు.త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.



రూ.35లక్షలతో నిర్మించిన మునగపాక దళితవాడకు వెళ్లే రోడ్డు



రూ.3.74కోట్లతో నిర్మిస్తున్న మునగపాక -కశింకోటకు రోడ్డు

ఇక్కట్లు తప్పాయి



గణపర్తి నుంచి మండల కేంద్రానికి రావాలంటే 10కిలోమీటర్ల ప్రయాణించాలి. రహదారి సదుపాయం లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు తప్పేవికావు. ఎక్కడపడితే అక్కడ గోతులు దర్శనమిచ్చేవి.రాత్రుల సమయంలో నరకయాతన పడేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించారు. గణపర్తికి వచ్చే రోడ్డు సుందరంగా తయారైంది. రాకపోకలకు వీలుగా ఈ రోడ్డు నిర్మాణం జరిగింది.

– కాండ్రేగుల సీతారామ్, ద్విచక్ర వాహనదారుడు,గణపర్తి

అద్దంలా బైపాస్ రోడ్డు



మునగపాక బైపాస్ రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది.గోతులు పెరిగిపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొన్నాం.మునగపాక రావాలంటే నరకయాతన పడేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుకు మహర్దశ పట్టింది. ఈ రోడ్డును అద్దంలా తయారు చేశారు. రహదారి సమస్య తీరింది. రాకపోకలకు ఎదురయ్యే సమస్య పరిష్కారమైంది.

– పెతకంశెట్టి లీలా భాస్కర్, వస్త్ర వ్యాపారి,వాడ్రాపల్లి

సౌకర్యంగా ప్రయాణం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల సమస్య పరిష్కారమవుతోంది. గతంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉండేవి.నేడు పలు ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా రహదారులు నిర్మించారు. కోట్లాది రూపాయలతో రహదారులు నిర్మించడం వల్ల ప్రయాణం సౌకర్యవంతంగా ఉంది. ప్రభుత్వం రహదారుల నిర్మాణాలపై దృష్టి సారించడం శుభ పరిణామం.

– రాయి బుజ్జి, మడకపాలెం

మండల వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి చర్యలు



గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణాలపై దృష్టి సారించాం. శిథిలావస్థకు గురైన రహదారుల అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరయ్యాయి.ఇప్పటికే మండల వ్యాప్తంగా పలు చోట్ల రహదారుల నిర్మాణాలు పూర్తి చేశాం.మరికొన్ని చోట్ల రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.దీనికి తోడు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు మంజూరయ్యే నిధులతో రహదారుల నిర్మాణాలు జరిగేలా చూస్తున్నాం.

– యు.వి.రమణమూర్తిరాజు, ఎమ్మెల్యే

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు దుప్పట్లు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు



దివ్యాంగులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రయ్యదొర

మునగపాక: స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఎస్కార్ట్, రవాణా సదుపాయం, గర్ల్ స్టైఫండ్‌లను ఎస్ఎస్ఏ ద్వారా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు సర్పంచ్ దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రత్యేక ఎడ్యుకేటర్స్ దేముడుబాబు, భవాని, సుమతి, జువ్వాలు,ఎంపీటీసీబోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: దివ్యాంగుల్లో అసాధారణ ప్రతిభ ఉంటుందని, వైకల్యం ఉందని కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే తప్పనిసరిగా విజయం సాధించవచ్చని ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రయ్యదొర అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను దివ్యాంగ విద్యార్థులకు వారు అందజేశారు. యలమంచిలి రోటరీ క్లబ్ తరఫున విద్యార్థులకు పండ్లు అందజేశారు. పులపర్తి హైస్కూల్ హెచ్ఎం శ్రీరామ్మూర్తి బహుమతులు,శీతల పానీయాలు తన సొంత నిధులతో సమకూర్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్యగుప్తా, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కొల్లిత్రినాథ్, ఎంఈవో 2 అరుణ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొణతాల విశ్వేశ్వరరావు,రోటరీ క్లబ్ ప్రతినిధులు వెంకటగిరి,బాబ్జి,గోకివాడనాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

మునగపాక: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునగపాకలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడారు. సీఐటీయూ నేత బ్రహ్మాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి,రామలక్ష్మి,తులసి లక్ష్మి,అంజలి, అరుణ,శ్రావణి, దేవీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు

మునగపాక: ప్రజలకు రానున్న కాలంలో మరిన్ని సేవలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మండలంలోని గణపర్తిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మేలు జరిగిందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చదరం నాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, సచివాలయ కన్వీనర్ చదరం అప్పలనాయుడు,పార్టీ నేతలు కాండ్రేగుల సీతారామ్,జగ్గారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ప్రసాద్,పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడులు ఆవిష్కరించారు.



గణపర్తిలో ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ముమ్మరంగా పంట నష్టం నమోదు

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరిపంట నష్టం వివరాల నమోదు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. దిమిలిలో వీఏఏ మేఘన క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. మండలంలో పలు గ్రామాల్లో 1,700 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు ఏవో సి.సుమంత తెలిపారు. ఇప్పటికే 1000 ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి బాధిత రైతుల వివరాలు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ నెల18తో నష్టం నమోదు గడువు పూర్తవుతుందన్నారు. మిచాంగ్ తుపాన్ కారణంతో రబీ సీజన్ వరినారు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు అందజేయనున్నట్టు చెప్పారు. సోమ, మంగళ వారాల్లో 160 క్వింటాళ్ల వరి విత్తనాలు వస్తాయని తెలిపారు.



దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ మేఘన

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

ఎర్రవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ఎర్రవరంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న హనుమంతరావు

అచ్యుతాపురం: మండలంలోని ఎర్రవరంలో శుక్రవారం వికసిత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో బీజేపీ సైనిక్ సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని పీఎం ప్రధాని కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ రాము, నర్మాల అప్పలస్వామి నాయుడు, సిరసపల్లి సత్యనారాయణ, గగన్, వైద్యురాలు కల్యాణి, కార్యదర్శి శ్యామల, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో రెండు పతకాలు



రన్నింగ్ పోటీలో ప్రతిభ కనబరచిన నాగవెంకటదుర్గ

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు పీడీ కె.శ్రీను తెలిపారు. ఎస్.రాయవరానికి చెందిన తూము నాగవెంకట దుర్గ ఈ నెల 12,13,14 తేదీల్లో పల్నాడు జిల్లా నర్సారావుపేట డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్టు చెప్పారు. అండర్ 17 విభాగంలో 400 మీటర్లు రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, 1500 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన నాగవెంటక దుర్గను పాఠశాల ఉపాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

బడుగుల సంక్షేమమే ధ్యేయంగా పథకాల అమలు

ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన విధంగా అవ్వాతాతలకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ నగదు మొత్తాన్ని రూ.3వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన డీఎల్ పురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జనవరి నెల నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3వేలకు పెంచేందుకు కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరుతున్నామని చెప్పారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వం వల్ల ప్రతి కుటుంబం లబ్ధిపొందినట్టు తెలిపారు. రెండేళ్ల కిందట తాము అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ రద్దుచేస్తామని ప్రకటించిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ప్రకటించి, ఇప్పుడు మాట మార్చి, అధికారం కోసం ఈ పథకాలన్నీ కొనసాగిస్తామని చెబుతున్నారన్నారు. వారు బూటకపు మాటలు నమ్మితే మరో ఐదేళ్లమోసపోతారన్నారు. అనంతరం గ్రామంలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వేంపాడు పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి అయినంపూడి మణిరాజు, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు లొడగల చంద్రరావు, సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి యలమంచిలి తాతబాబు, ఎస్ఎంసీ చైర్మన్ ప్రసాదుల శ్రీను, పార్టీనాయకులు లొడగల సత్యనారాయణ, బాబ్జి, కొర్లయ్య, నాగేశు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



డీఎల్‌పురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెలే బాబూరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు

అచ్యుతాపురం: అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే సీఎంగా జగన్మోహన్ రెడ్డినే మళ్లీ ఎన్నుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు తెలిపారు. మండలంలోని చీమలాపల్లిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం సంక్షేమ లబ్ధి, అభివృద్ధి వివరాలతో రూపొందించి బోర్డుని ఆవిష్కరించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేర రెడ్డి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో–ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన లచ్చన్నాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బైరాగి, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ మజ్జి రమణ తదితరులు పాల్గొన్నారు.



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

మేలు రకాల పశువుల పెంపకంతో అధిక పాల ఉత్పత్తి

ఒడ్డిమెట్టలో లేగ దూడల ప్రదర్శన



అధిక పాల ఉత్పత్తి చేసే రైతులకు ప్రోత్సాహం అందజేస్తున్న అధికారులు

నక్కపల్లి: మేలు రకాల పశువులను పెంచడం ద్వారా అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని డీఎల్‌డీఏ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మోహన్‌రావు, నక్కపల్లి వెటర్నరీ ఏడీ డాక్టర్ వీర్రాజులు తెలిపారు. మండలంలోని ఒడ్డిమెట్టలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక పాల ఉత్పత్తి సాధించాలంటే మేలు రకాలైన పశువులను పెంచాలన్నారు. అనంతరం అధిక పాల ఉత్పత్తి సాధించే రైతులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొర్ల నర్సింహమూర్తి, డీఎల్‌డీఏ డైరెక్టర్ నల్లల రామకృష్ణ, గొడిచర్ల పశువైద్యాధికారి దీప్తి, రైతులు సూరిబాబు, వరహాలబాబు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్ :
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com